పెద్దకథ:



# జీవన వలయాలు

చిత్రపు హనుమంతరావ్

(గత సంచిక తరువాయి)

ఓరోజు ఉదయం పార్వతమ్మ పక్క మీద నుండి లేవలేకపోయింది. వళ్ళు కాలే జ్వరం, దానికితోడు వళ్ళంతా నొప్పులు వచ్చినాయి. అప్పాటు సరస్వతమ్మే అన్నం వండింది ఆవిడ పిలిచాక, సారధి భోజనానికి వెళ్ళాడు. నాలుగుమెతుకులు కొరికి భోజనం అయిందనిపించి లేస్తూ,

'ఈ పూటవంట నువ్వు చేశావేమిటి అమ్మమ్మా?' అన్నాడు.

'మీ అమ్మకు జ్వరం తగిలింది...'

సారధి ఆత్రంగా తల్లి గదిలోకి వెళ్ళాడు ఆవిడ కళ్ళుమూసుకుని నిద్రపోతున్నది. తల్లి వంటిమీద చెయ్యివేసి చూశాడు సారధి చురుక్కుమన్నది. వెంటనే డాక్టరు రామారావుగారింటికి బయలుదేరాడు.

సారధి వెళ్ళేసరికి హేమసుందరి వరండాలో వాలుకుర్చీలో కూర్చుని వారపత్రిక చదువుతున్నది. సారధిని చూసీచూడడంతోనే, ఆమెకళ్ళు ప్రకాశవంతమయినాయి. లేచి నిలబడి,

'కూర్చోండి.' అని చెప్పి లోపలికు వెళ్ళింది.

'నీకోసం ఎవరో వచ్చారు నాన్నా...' అన్నది తండ్రితో.

'ఎవరమ్మా...'

హేమసుందరి సారధి పేరు చెప్పడానికి సిగ్గుపడి,

'నువ్వువెళ్ళి చూడు నాన్నా...' అన్నది.

రామారావుగారు నవ్వుతూ వరండాలోకి వచ్చారు. సారధిని చూసి,

'మీరా సారధిగారూ?...' అన్నారు.

సారధి ఆయనకు 'విష్'చేసి,

'మా అమ్మగారికి జ్వరం వచ్చిందండి...' అన్నాడు.

'ఇప్పుడే వస్తాను కూర్చోండి.' అంటూ లోపలకు వెళ్ళారు రామారావుగారు.

కొద్ది క్షణాల తరువాత రామారావుగారు 'డ్రస్సు' మార్చుకుని, వరండాలోకి వచ్చి, 'పదండి...' అన్నారు

సారధి లేచి, ఆయనను అనుసరించాడు హేమసుందరి వాళ్ళిద్దరినీ చూస్తూ వరండాలో నిలబడ్డది.

రామారావుగారూ, సారధీ ఒకరిపక్క ఒకరు నడుస్తున్నారన్నమాటేకాని, వాళ్ళిద్దరిమధ్య మాటలు లేవు చివరకు రామారావుగారు అన్నారు:

'మీ అమ్మగారికి ఎప్పటినుండి జ్వరం?'

'రాత్రి మామూలుగానే ఉంది... పొద్దున్నటికి వచ్చింది...'

మళ్ళీ కొద్దిక్షణాలు నిశ్శబ్దం.

'మీ సెలవు ఎంతవరకూ ఉంది?...'

'సెలవు తీసుకున్నాను... ఇంకా ఇరవై రోజులపైన ఉంది...'

ఇంతలో ఇల్లు వచ్చింది.

రామారావుగారు పార్వతమ్మను పరీక్షించారు, సారధి ఆత్రుతనిండిన స్వరంతో,

'ఏమీ భయంలేదు కదా డాక్టరుగారూ... టెంపరేచర్ బాగా ఉన్నట్లుంది...' అన్నాడు.

'కంగారు పడాలిసింది ఏమీలేదండి... మామూలు జ్వరమే... ఒకడోసు మాత్రలు మందు పడితే అదే తగ్గుతుంది. మీ పనిమనిషిని మందుకు పంపండి...'

రామారావుగారు వెళ్ళిపోయారు మందు తేవడానికి రాముడు ఆయనతోబాటు వెళ్ళాడు. రామారావుగారు వాడికి మందు ఇచ్చి పంపారు.

రాజ్యలక్ష్మమ్మ వర్తను చూస్తూ,

'పొద్దున్నే పార్వతమ్మగారింటికి వెళ్ళారేమిటి? ఆ మందు ఎవరికి?...' అన్నది.

రామారావుగారు 'డ్రస్సు' మార్చుకుంటూ,

'పార్వతమ్మగారికి జ్వరం తగిలింది...' అన్నాడు.

'అయ్యోపాపం...పాపం ఆ పిల్లాడు ఏం అవస్థ పడుతున్నాడో సరస్వతమ్మగారు దెబ్బయ్యేళ్ళు పైబడినావిడ...'

హేమసుందరి వాళ్ళ సంభాషణ వింటూ నిలబడ్డది.

ఆ మధ్యాహ్నం,

'పార్వతమ్మగారిని ఓసారి చూసివస్తానమ్మా...' అన్నది హేమసుందరి తల్లితో.

'అలాగే వెళ్ళివేతల్లి..' అన్నది రాజ్యలక్ష్మమ్మ.

హేమసుందరి పార్వతమ్మ ఇంటికి

బయలుదేరింది. సారధి తనగదిలో ఉంటూ డ(ఁ) ఊహతో ఆమె తిన్నగా పార్వతమ్మ గదిలోకి వెళ్ళింది. పార్వతమ్మ మంచంమీద పడుకుని దూలాలవైపు చూస్తున్నది. సారధి ఆ ప్రక్కనేఉన్న కుర్చీలో కూర్చుని ఉన్నాడు. వాళ్లిద్దరిమధ్యా మాటలులేవు. హేమసుందరి గాజుల గల గల వినిపించి, సారధి తలెత్తి చూశాడు హేమసుందరి గుమ్మం దగ్గర నిలబడి ఉన్నది. సారది లేచి, తన గదిలోకి వెళ్లిపోయాడు. హేమ సుందరి గదిలోకి వచ్చి, కుర్చీ పార్వతమ్మ మంచం దగ్గరకు జరుపుకుని కూర్చున్నది. పార్వతమ్మ ఆమె వైపుచూసింది. ఆవిడ కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి.

'మీ వంట్లో ఎలా ఉంది?...'

పార్వతమ్మ నిట్టూర్చింది. తన జ్వరం సంగతి వీళ్ళందరకూ తెలుసు, తన మనసులోని బాధ వీళ్లెవరికీ తెలియదు.

'కాఫీ అయ్యాయా...?'

'ఇంకా కాలేదు... అమ్మ ఇప్పటి వరకూ పనిచేసి పడుకుంది...'

హేమసుందరి మారు మాట్లాడక లోపలకు దారితీసింది. కొద్దిసేపట్లో కాఫీ తయారు చేసింది. సరస్వతమ్మకూ, పార్వతమ్మకూ ఇచ్చింది.

'నువ్వు తీసుకున్నావా హేమా?...' అన్నది పారతమ్మ.

'నాకు మీ ఇంట్లో మొహమాటంలేదు. తీసుకుంటాను...'

'వాడికి కూడా ఇచ్చేసిరా హేమా...'

'అలాగే...'

హేమసుందరి కాఫీగ్లాసుతో సారధి గదిలోకి వెళ్లింది అతడు కళ్ళు మూసుకుని కుర్చీలో కూర్చుని ఉన్నాడు. హేమసుందరి తన ఆగమనాన్ని సూచిస్తూ చిన్నగా దగ్గింది. సారధి కళ్లుతెరచి, ఒక్కక్షణం



అమె వైపుచూసి చూపులు మరల్చుకున్నాడు. ఆమెను చూస్తుంటే అతడికి ఆమెపై కసి, కోపమూ కలిగాయి. ఈ అమ్మాయిని మనసులో పెట్టుకునే కద తనమాటను కాదంటున్నది తల్లి. ఆ విషయాన్ని చెప్పక, పిచ్చి వంశపారంపర్యం వస్తుందనే మిషతో ఒద్దంటున్నది. ఈ అమ్మాయి తనకూ, నీరజకూ మధ్య నిలచిన అడ్డుగోడ!

'కాఫీ తీసుకోండి...'

హేమసుందరి మృదువుగా అనేసి, కాఫీ గ్లాసు బల్లమీద పెట్టి పార్వతమ్మ గదిలోకి వెళ్ళి కూర్చున్నది. కొద్ది క్షణాల తర్వాత సారధి బట్టలు మార్చుకుని బయటకు వెళ్ళిపోయాడు. ఖాళీ గ్లాసు తేవడానికి అతడి గదిలోకి వెళ్ళింది హేమ సుందరి. సారధి కాఫీ త్రాగలేదు—గ్లాసు తను ఎలా పెట్టిందో అలాగే ఉన్నది. ఆమెకు అది అవమానంగా తోచింది. కళ్ళల్లో నీళ్ళు వచ్చినాయి. అయితే సారధి అలా ప్రవర్తించడానికి కారణం ఏమిటో మాత్రం ఆమెకు అర్థం కాలేదు.

'వాడు కాఫీ త్రాగాడా హేమా?...' అన్నది పార్వతమ్మ.

'లేదు...ఆయన త్రాగుతారు కదా అని గ్లాసు బల్లమీద పెట్టి వచ్చాను...త్రాగకుండానే వెళ్ళిపోయారు...'

పార్వతమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది.

హేమసుందరి ఆవిడతో కాస్సేపు కబుర్లు చెప్పి, ఇంటికి వెళ్ళిపోయింది.

సారధి పెత్తల్లిగారింటికి వెళ్ళాడు. తల్లికి జ్వరంగా ఉందని చెప్పి,

'అమ్మమ్మ చాలా శ్రమపడుతోంది...' అన్నాడు.

'నేను వస్తానులే తమ్ముడూ ... రిక్షా పిలుచుకుని రా...' అన్నది పద్మావతి.

సారధి రిక్షా తెచ్చేలోపల, పద్మావతి రెండు మూడురోజులకు సరిపడ బట్టలు ఓ సూటుకేసులో సర్దుకున్నది.

రిక్షా ఇంటిదగ్గర ఆగగానే దిగి, రిక్షా వాడికి డబ్బులిచ్చి,

'నువ్వు లోపలకు పద అక్కా...నేనిప్పుడే వస్తాను ...' అంటూ వెళ్ళిపోయాడు సారధి

పద్మావతి లోపలకు వెళ్ళేసరికి పార్వతమ్మ నిద్రపోవడం లేదు. శూన్యంలోకి చూస్తూ మంచం మీద పడుకుని ఉన్నది.

'ఏమిటిపిన్నీ ... అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?...' అంటూ లోపలకు వెళ్ళింది పద్మావతి.

పార్వతమ్మ నిట్టూర్పు విడుస్తూ.

'ఏమిటే ఇలా వచ్చావ్ పద్మా...' అన్నది.

'నీకు జ్వరం వచ్చిందని పార్థుడు వచ్చి చెప్పాడు...'

'ఏడీ...వాడేడీ...'

'ఇప్పుడే వస్తానని ఎక్కడికో వెళ్ళాడు.'

'వాడి ప్రవర్తన నాకు అర్థం కావడం లేదే పద్మా...వాడు తిరిగి వచ్చేది రాత్రి పది గంటలకే...'

పద్మావతి మాట్లాడలేదు.

'మధ్యాహ్నం పాపం డాక్టరుగారి అమ్మాయి వచ్చింది...కాఫీ కలిపింది...వాడికి ఇవ్వబోతే త్రాగకుండానే వెళ్ళిపోయాడు... పాపం ఆపిల్ల ఎంతగా నొచ్చుకుందో... అయినా ఏం చేసిందని ఆ పిల్లమీద కక్ష?...'

'నువ్వు అనవసరంగా దిగులు పడకు పిన్నీ...పార్థుడి మనస్తత్వం మనకు కొత్త కాదు...వాడికి వయస్సయితే వచ్చింది; చదువయితే అబ్బింది; ఆఫీసరు ఉద్యోగమయితే వచ్చింది...కానీ వాడిది పసివాడి స్వభావం పిన్నీ ... పసివాడు ఏదయినా కావాలని మారాం చేస్తాడు...ఇవ్వకపోతే సంభాళించుకోలేడు ... పార్థుడూ అంతే... కొద్దిరోజులు పోతే వాడు నీరజను మరుస్తాడు...మామూలు మనిషవుతాడు...'

పార్వతమ్మ పద్మావతి వైపుచూసి,

'అంతే నంటావా?...' అన్నది.

'అంతే పిన్నీ ... అనవసరంగా మనసు పాడు చేసుకోక కాస్సేపు పడుకో...'

ఆ సాయంత్రానికి పార్వతమ్మ జ్వరం తగ్గలేదు. ఉదయం కన్న ఎక్కువయింది. డాక్టరుగారికి కబురు వెళ్ళింది. ఆయన వచ్చి, ఆవిడను పరీక్షించి, మందులు మార్చారు

రాత్రి సారధి ఇల్లు చేరుకునేసరికి పది గంటలు దాటింది. అతడు వెళ్ళేసరికి పద్మావతి హాల్లో కూర్చుని ఉన్నది.

'ఇంతవరకూ నువ్వు ఎందుకు మెలకువగా ఉన్నావ్ అక్కా...'

పద్మావతి అతనివైపు చూసిందికాని, మాట్లాడలేదు.

'అమ్మకు ఎలా ఉంది?...

'అమ్మకు ఎలా ఉందోనన్న ఆదుర్దా నీకు ఉండి ఉంటే రాత్రి పది గంటల వరకూ తిరగగలిగే వాడివా పార్థూ?...

'అక్కా...'

'అవునురా...నేనన్నదానికి సమాధానం చెప్పు...'

'నాకు మనసు బాగుండడంలేదు...'

'నీవల్ల తక్కినవాళ్ల మనసులు బాగుండడం లేదురా...పిన్నికి జ్వరం ఎందుకొచ్చిందో తెలుసా? నిన్ను గురించి మనసు పాడు చేసుకుని, వేళకి నాలుగుమెతుకులు తినక వంటికి తెచ్చుకుందిరా ... పిన్ని జ్వరానికి కారణం మానసిక వ్యధరా...'

'అయితే నన్నేం చెయ్యమంటావ్?...'

'ఏం చెయ్యాలో నీకు తెలియదా?...'

సారధి కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉండి,

'అమ్మ కోరిక ఏమిటో నీకు తెలియంది కాదు...ఆ కోరిక నేనెలా తీర్చగలను?...' అన్నాడు.

'అక్కడే నువ్వు తప్పటడుగు వేశావ్

## ఖాయ్! రుధిరపాయ్!!

అవని వికసిస్తున్నప్పుడు
అగ్నిశిఖలను వర్షించకు!
రాగాలు తీగెలు సాగుతున్నప్పుడు,
తీగెల త్రెంచాలని యత్నించకు!
మనసుల తోటలలో,
మమతల మందారాలు,
కళ్ళు తెరచి చూస్తున్నప్పుడు,
మంచితనం సౌరభాల,
కుంచించుక పోతున్న,
గుండెలను విశాలం చేసి,
కొత్త జీవితానికి,
ఆశల వెలుగుల నందిస్తున్నప్పుడు,
కసితో కరాసి తీసి,
కూకటివేళ్ళతో పెకిలించకు
మందారాల ఆధారాలను,
కోసి ముళ్ళలు పోయకు
లేతలేతని పూతరేకులను!
నవ్వని జీవితాలకు,
నిప్పు రగిలించకు!
నడుస్తున్న చరిత్రను,
రక్తాక్షరాలతో లిఖించకు!!

—యస్. మహాలక్ష్మి

## జీవనవలయాలు

తమ్ముడూ . మన అంతస్తు నీకు తెలియంది కాదు; మన పెద్దవాళ్ళ మూఢనమ్మకాలు నీకు తెలియనివి కావు...పిన్నికి ఉన్నదల్లా నువ్వు ఒక్కడివి...అలాంటిది పిన్నితో మాట మాత్రమయినా చెప్పకుండా పెళ్లి చేసుకుంటానని నీరజకు ఎలా మాటియ్యగలిగావ్?...పోనీ నాతోనయినా ముందుగా చెప్పావా?...అంతా రహస్యంగా ఉంచావ్... నాకు ముందుగానే తెలిసిఉంటే పరిస్థితి ఇలా తయారయ్యేది కాదు ... ముందే నిన్ను హెచ్చరించి ఉండేదాన్ని...అదే నువ్వు చేసిన పొరపాటు పార్థూ...'

సారథి మరేమి మాట్లాడక తనగదిలోకి దారితీశాడు.

'బట్టలు మార్చుకుని రా ... భోజనం చేద్దువుగాని...'

'నాకు ఆకలిగా లేదు ..'

'నీతో కలిసి తిందామని నేనూ తినలేదు .. నువ్వు తినకపోతే నేనూ పస్తుపడుకోవాలిసి వస్తుంది...మా ఇంటికి వచ్చి, నేను పస్తుపడుకుంటే, పాపం నీనే చుట్టుకుంటుంది..'

'పద వస్తున్నాను...'

సారథి వెళ్ళి భోజనం చేశాడు.

* * *

మరొక రెండు మూడు రోజులు గడచిపోయాయి. పార్వతమ్మ ఆరోగ్యంలో మార్పు లేదు. జ్వరం ఉదయానికి తగ్గి, సాయంత్రమయ్యేసరికి హెచ్చుతున్నది. దానికి కారణం పగలస్తమానమూ కొడుకు గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవడమే. చివరకు రామారావుగారు ఓ నిర్ధారణకు వచ్చారు. ఆవిడ జ్వరానికి కారణం మానసికవ్యధ. అంతకుతప్ప శారీరకంగా ఆవిడలో ఏవిధమయిన దోషమూ లేదు. సారథితో అన్నారాయన :

'మీ అమ్మగారికి జబ్బేమీలేదు...మానసిక వ్యధ ఈ జ్వరానికి కారణమనిపిస్తోంది... ఆవిడమనసుకు శాంతి, శరీరానికి విశ్రాంతి కావాలి...ఆవిడ మానసిక వ్యధకు కారణమేమిటో కనుక్కోండి...'

సరస్వతి అక్కడే నిలబడి ఉన్నది. రామారావుగారు వెళ్ళిపోయాక, సారథితో

'నేను ముందరేఅనుకొన్నాను తమ్ముడూ.. పిన్ని పగటిపూట ఒక్కక్షణమయినా కన్ను మూయటంలేదు...దీర్ఘంగా ఆలోచిస్తూనే కూర్చుంటున్నది...' అన్నది.

సారథి జవాబు చెప్పలేదు. చాలాసేపు అచేతనంగా కుర్చీలో కూర్చుండిపోయాడు. తల్లికి మానసిక వ్యథ ఎందుకో తనకు తెలుసు. మరి తను అనుభవిస్తున్న మానసిక వ్యథ? తల్లికోరిక తీర్చాలంటే, ఆవిడ చెప్పిన అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ వెయ్యాలి. తను తల్లిమాటను కాదంటే, 'తను తల్లిని ఏడిపించాడు' అంటుంది లోకం.

ఆ రాత్రి సారథికి నిద్రపట్టలేదు. ఆలోచిస్తూనే పడుకున్నాడు.

ఆ మరునాడు ఉదయం సారథి మాటాడుతూంటే పార్వతమ్మ అన్నది :

'నాన్నా పార్థూ...నా ఆరోగ్యం రోజురోజుకూ అధ్వాన్నమవుతోంది ... ఎక్కువకాలానికి ఎలా ఉంటానో.. ఓ కోరిక మిగిలిఉంది... అది తీరితే నిశ్చింతగా కళ్ళుమూస్తాను...'

సారథి తల్లివైపు పాలిపోయిన ముఖంతో చూశాడు.

'నేను అనుభవిస్తున్న మానసిక వ్యథ చాలమ్మా...మాటలతో మరింత చిత్రవధ చెయ్యకు...' అన్నాడు.

'ఓ కోరిక మిగిలి ఉంది...అది తీరుస్తానని మాట ఇయ్యరా నాన్నా...'

సారథి గొంతు పెగల్చుకుని, నిస్సహాయంగా,


'చెప్పమ్మా...' అన్నాడు.

'నువ్వొక ఇంటివాడివి కావాలిరా నాన్నా... కళకళలాడుతూ కోడలు ఇంట్లో తిరగాలి..'

సారథి సమాధానమియ్యలేదు.

'నీ సుఖసంతోషాలకు అడ్డువస్తున్నానని అనుకుంటేవు నాన్నా ... అదిమాత్రం నిజం కాదు...ఇంతకాలమూ నీ కోసం బతికానురా.. అలాంటిది నిన్ను కష్టపెట్టగలనా?... నీ సుఖ సంతోషాలకంటే నాకు కావాలిసిందేమీ లేదు...నీరజ విషయంలో నీ సుఖసంతోషాలను దృష్టిలో పెట్టుకునే ఎదురు చెప్పాలిసి వచ్చింది...ఆంధ్రదేశంలో పెళ్ళి కాని అమ్మాయిలకు కొదవలేదు...నీరజ తప్ప మరో అమ్మాయిని ఎన్నుకో..పిచ్చి ఉన్న వంశంలో పిల్లమాత్రం వద్దు.. నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తాను. నువ్వు సుఖపడతావని తోచినప్పుడు అంతస్థులకు కూడా విలువ నివ్వను...'

'ఆ విషయంలో నన్ను క్షమించమ్మా... నీకు ఎదురుచెప్పి నీరజను పెళ్ళిచేసుకోలేను... కాని మరో అమ్మాయిని మాత్రం పెళ్ళిచేసుకోలేనమ్మా... నీరజ ఉట్టి అమాయకురాలు... ఆమెను 'ప్రేమ' అనే ఊబిలోకి దింపి, ఆశలు కల్పించాను... చివరకు వంచించాలిసి వస్తోంది ... ఈ మనసు ఒక యంత్రం కాదు... ఒకరికి ఇచ్చింది వాపసు తీసుకుని మరొకరికి ఇవ్వడానికి ... నువ్వు కోరినట్టు మరో అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే నన్ను నేను వంచించుకోవడమే కాదు; ఆ అమ్మాయినికూడా వంచించినట్టవుతుంది... ఒకరి సుఖసంతోషాలతో చెల



గోట మాడటానికి నాకు అధికారం లేదమ్మా...'

'ఇప్పుడేకద ... నా మాట వింటా నన్నావు...'

'నేను సుఖపడ్డా, సుఖపడకపోయినా, నేను మరో అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం నీకు సంతోషాన్ని కలుగజేసే పక్షంలో అలాగే కానియమ్మా... ఓ అమ్మాయి నీకు కోడలుగా వస్తుంది ... ఆ వచ్చే అమ్మాయి సుఖపడితేనేం? ... పడకపోతేనేం? నాకేం? నువ్వు నాతల్లివి నిన్ను సంతోషపెట్టడమే నా విధి...'

సారథి స్వరంలో చిరాకూ, చికాకూ మిళితమయి ఉన్నాయి. సారథి అక్కడ నుండి లేచి వెళ్ళిపోయాడు. పార్వతమ్మ తేలిగ్గా ఊపిరి తీసుకున్నది. ఆ తర్వాత ఆవిడ చాలాసేపు ఆలోచిస్తూనే ఉన్నది. తను కోరుకునేదల్లా కొడుకు సుఖం. ఇప్పుడు కొడుకు మనసంతా ఆ నీరజపైనే ఉన్నది. వాడి మనసు మరో అమ్మాయి వైపు మళ్ళించాలి. రోజులు గడిచాక నీరజను మరుస్తాడు. హేమ తెలివయినపిల్ల. పైగా చదువుకున్నది. అంతేకాక అందంలో ఆ నీరజ, హేమ కాలిగోటికి కూడా సరితూగదు! వాడిచేత హేమ మెళ్ళో మూడు ముళ్ళూ వేయించడంవరకే తనపని. ఆ తర్వాత వాడి సంగతి హేమ చూసుకుంటుంది! హేమ వాడిని ఓ మార్గంలో పెట్టగలదన్న నమ్మకం తనకు ఉన్నది.

* * *

మరొక రెండుమూడురోజులకు పార్వతమ్మ జ్వరం తగ్గింది. ఓరోజు ఉదయం రామారావుగారు వచ్చినప్పుడు 'కొడుకు పెళ్ళి త్వరలో చేసేద్దా'మనుకుంటున్నట్లు చెప్పింది పార్వతమ్మ.

'మా హేమను చేసుకోకూడదటమ్మా... కట్నం అయిదారు వేలకంటే ఇవ్వలేను కాని, లాంఛనాల విషయంలో లోటు రానివ్వను...'

'నాకు కట్నాలపైనా, కానుకలపైనా మోజు లేదండీ ... అబ్బాయికి అమ్మాయి నచ్చితే అంతేచాలు ..'

ఆ సాయంత్రం రామారావుగారు సతీసమేతంగా వచ్చి, మరునాడు ఉదయం తొమ్మిది, పదిగంటల మధ్య బావుందని, పిల్లను చూసుకోవడానికి రమ్మని పిలిచారు.

'సరేన'న్నది పార్వతమ్మ.

హేమ తను రోజూ చూసే అమ్మాయే, తను చూడ్డం ముఖ్యంకాదు. కొడుకు చూడాలి. 'అసలు హేమను సరిగ్గా చూశాడో లేదో?' అనిపించింది. పద్మావతి పెళ్ళి చూపులకు వెళ్ళడానికి ఉత్సాహాన్ని చూపించింది. సారథిమాత్రం 'నీకు నచ్చితే సరే నమ్మా...నీ ఇష్టప్రకారం చేసుకుంటున్న పెళ్లి' అన్నాడు. పార్వతమ్మ 'ససేమిరా' వీల్లేదన్నది.

తెల్లవారింది. హేమసుందరి తల్లి బలవంతంపై తలంటుపోసుకున్నది. కళ్ళకు కాటుక దిద్దుకుని, నుదుట కుంకుమ తీర్చిదిద్దుకున్నది. కాళ్ళకు పారాణి పులుముకున్నది. వదులుగా జడల్లుకుని, మల్లెల మాల తురుముకున్నది. తల్లి తీసి ఇచ్చిన పట్టు జాకెట్టూ, పట్టుచీర కట్టుకున్నది. తల్లి ఆజ్ఞ ప్రకారం రెండు చేతులకూ నిండుగా గాజులువేసుకుని, మెడలో కాసుల పేరులేసుకుని, చెవులకు రాళ్ళదుద్దులు పెట్టుకున్నది.

తొమ్మిది కాకుండానే రామారావుగారు గ్లాస్కోపంచ, సిల్కు లాల్చీ వేసుకుని పెళ్లివారికోసం ఎదురుచూడసాగారు. మధ్య మధ్య 'అమ్మాయి ముస్తాబు అయిందా? వాళ్ళు వచ్చేవేళయింది.' అంటూ భార్యను తొందరపెట్టసాగారు. (ఇంకా వుంది)





తామర, తీటు, గజ్జి వగైరా సోకిన చర్మంమీద మీరు

**అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్**

రుద్దినపుడు ఏమి జరుగుతుంది?

అమోఘంగా పనిచేసే అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్‌లోని దినుసులు ప్రతి రంధ్రంలోని క్రిములను ఎదుర్కొంటాయి. ఫలితం: చర్మబాధలకు చల్లటి ఉపశమనం!

అమృతాంజన్ లిమిటెడ్ మద్రాసు 4

PDSADO1791 TE

పెద్ద కథ:



# జీవన వలయాలు

చిత్రపు హనుమంతరావ్

(గత సంచిక తరువాయి)

తొమ్మిదింపావయ్యేసరికల్లా పద్మావతీ, సారథీ వచ్చారు. రామారావుగారు వాళ్ళిద్దరూ సాదరంగా ఆహ్వానించారు వాళ్ళిద్దరినీ లోపలకు వెళ్ళికూర్చున్నాక రాజ్యలక్ష్మమ్మ కాఫీ ఫలహారాలుతెచ్చి వారిరువురికీ ఇచ్చి లోపలకు వెళ్ళింది కొద్ది నిముషాల తర్వాత తల్లి ప్రక్కన సుతారంగా అడుగులువేస్తూ వచ్చి, చాపమీద కూర్చున్నది హేమసుందరి సారథి ఆమె రాకను గమనించలేదు శూన్యంలోకి చూస్తూ పరధ్యానంగా కూర్చున్నాడు పద్మావతి హేమసుందరివైపు కళ్ళింతవి చేసుకుని చూస్తూ కూర్చున్నది పసిడిఛాయ.. ఇంపయిన కనుముక్కులరు ... ఒత్తయిన బారెడు నల్లని తలకట్టు... చిన్ననోరు... సన్నని మెడ... విత్తయిన వక్షస్థలము.. సన్నని నడుము... ఆ అందాన్ని లోలోపల మెచ్చుకోకుండా ఉండలేకపోయింది పద్మావతి. మాటవరుసకు నాలుగయిదు ప్రశ్నలు వేసింది. హేమసుందరి తలవంచుకునే శ్రావ్యమయిన స్వరంతో సమాధాన మిచ్చింది. 'అందానికి తగ్గ స్వరం... వినయవిధేయతలు... ఈ పిల్లను భార్యగా పొందగలుగుతున్న సారథి అదృష్టవంతుడు' అనుకున్నది పద్మావతి ఆమెకు నీరజ గుర్తుకు వచ్చింది. ఈ హేమసుందరిముందు నీరజ ఏపాటిది? పెళ్ళయిన కొద్దిరోజుల్లోనే సారథి నీరజను మరచిపోతాడు అంతేకాక హేమసుందరిని చూస్తూ ఉంటే సారథిని ఓమార్గాన పెట్టగలదన్న నమ్మకం కుదురుతున్నది.

పద్మావతీ, సారథి లేచారు. హేమసుందరి లోపలకు వెళ్ళిపోతూ ఓరకంటితో సారథివైపు చూసింది. అతడు మరోవైపు చూస్తున్నాడు. అంతవరకూ తను సిగ్గుతో అతడివైపు చూడలేకపోయింది అతడు 'తనవైపు కళ్ళింతవి చేసుకుని, నిశితంగా తనవైపు చూసే ఉంటాడు ఇప్పుడు 'మి ఎరగనట్లు చూపులు తప్పించాడు' అనుకున్నదామె.

ఇంటికి తిరిగి వచ్చాక, పద్మావతి హేమసుందరి అందచందాలూ, వినయవిధేయతలూ పొగుడుతూ చెబుతూంటే, సారథి తనకేమీ పట్టనట్లు కూర్చుండిపోయాడు

రెండురోజులు గడచిపోయాయి అప్పటికే రామారావుగారు పార్వతమ్మ ఇంటికి రెండు మూడుసార్లు వచ్చారు. 'ఏ సంగతీ చెప్పమ'ని. ఆ విషయం సారథి తల్లిదగ్గర ఎత్తలేదు. రామారావుగారిని తమ ఇంటిచుట్టూ తిప్పుకోవడం భావ్యం కాదనిపించింది పార్వతమ్మకు. ఆవిడ సారథితో అన్నది:

'మాష్టరుగారు అప్పుడే రెండుమూడు సార్లు వచ్చి వెళ్ళారు ... ఏ సంగతి చెప్పావు కాదు.'

సారథి అవుననలేదు; కాదనలేదు.

'హేమ నీకు నచ్చిందో లేదో చెప్పావు కాదు...'

సారథి తల్లి ముఖంలోకి చూస్తూ,

'ఆ అమ్మాయి నీకు నచ్చిందా అమ్మా...' అన్నాడు.

'నాకు నచ్చింది కాబట్టే నిన్నడగడం.. కాకపోతే నేనే చెప్పేసేదాన్ని మరో సంబంధం చూసుకోమని.'

'నీకు నచ్చడమే ముఖ్యమమ్మా .. నీరజ కాకపోయాక ఏ అమ్మాయి అయినా ఒకటే. నీకు నచ్చిన అమ్మాయిని చేసుకుంటే, నిన్నయినా సంతోషపెట్టినవాడి నవుతాను.'

'అయితేనరే ... పిల్ల నచ్చిందని చెప్పి ముహూర్తం పెట్టించమంటాను...'

సారథి మరేమీ మాట్లాడక తన గదిలోకి వెళ్ళిపోయాడు.

పార్వతమ్మ ఆరోజే రామారావుగారికి కబురు పంపించింది ఆయన వెంటనే వచ్చారు. ఆవిడ 'పిల్ల నచ్చింద'ని చెప్పి, వీలయినంత తొందరలో ముహూర్తం పెట్టించమన్నది. ఆయనకు కలిగిన సంతోషం వర్ణనాతీతం.

ఆ తర్వాత సందేహిస్తూ

'మరి కట్నం కానుకల విషయం?...' అన్నాడు

పార్వతమ్మ నవ్వింది. ఆవిడ నవ్వులో నిండుదనం లేదు. 'కొడుక్కి ఇష్టంలేని పెళ్ళి చెయ్యాలిసి వస్తున్నదే' అన్న బాధ

ఇమిడి ఉన్నది.

'కట్నం కానుకలకు ప్రాధాన్యతనివ్వను ముందే చెప్పాను... మాకు పిల్ల ముఖ్యం. పిల్ల మాకు నచ్చింది...'

'మీరు అడగలేదు కదా అని పిల్లనీ, కొబ్బరిబోండాన్నీ ఇవ్వనమ్మా... నా శక్తికి తగినట్లు ముట్టచెబుతాను...'

'అబ్బాయికి మరి పదిహేనురోజులకన్నా సెలవులేదు... సరింక పొడిగించడానికి వీలు పడదేమో. వారం పదిరోజుల్లో ముహూర్తం పెట్టించండి.'

'మరి వెళ్ళొస్తానమ్మా...'

'మంచిది... వెళ్ళిరండి...'

* * *

రామారావుగారి ఇల్లు పెళ్ళి సందడితో కళకళ్ళాడుతున్నది.

మంగళవాద్యాలు మరింత జోరుగా వాయించారు వాద్యగాళ్ళు. సారధి మంగళసూత్రం పట్టుకుని నిలబడ్డాడు. రాజ్యలక్ష్మమ్మ కూతురిజడ ఎత్తిపట్టుకున్నది. సారధి హేమసుందరి మెళ్ళో మూడుముళ్ళూ వేశాడు. మాంగల్యం ముడి వేస్తున్నప్పుడు అతడి చేతులు వణికి, వేళ్ళు వధువు మెడకు తగిలినాయి. వధువు సిగ్గుతో మరింత ఒదిగిపోయింది. పెళ్ళికి వచ్చిన పెద్దలందరూ వధూవరులపై అక్షతలు చల్లి, పిల్లా, పాపలతో కలకాలం చల్లగా కాపురం చేసుకోమని దీవించారు. పార్వతమ్మ తేలిగ్గా నిట్టూర్చింది. రాజ్యలక్ష్మమ్మ కూతుర్నీ, కొత్త అల్లుడిని చూసుకుని తృప్తిపడ్డది. రామారావుగారు మూడవ కూతురు పెళ్ళికూడా చేసేశానని 'రిలీఫ్' పొందారు. పెళ్ళికొచ్చిన వాళ్ళంతా వధూవరులనుచూసి, ఈడూ జోడూ బావుందని అనుకున్నారు.

పార్వతమ్మ కట్నం కానుకలు ఏమీ అడగకపోయినా, రామారావుగారు లోటు చెయ్యలేదు. అయిదువేలు కట్నమిచ్చారు. పిల్లకు పసుపుకుంకుమల క్రింద ఓ ఎకరం పొలం వ్రాసి ఇచ్చారు; ఆడబడుచులు లేకపోయినా, పద్మావతికి వెయ్యిన్నూట పదహార్లు చదివించారు. వ్యవధి అట్టే లేకపోయినా, పెళ్ళి ఘనంగా చేశారు.

అది మొదటిరాత్రి — హేమసుందరి తెల్లనిచీర కట్టుకుని, తెల్లని జాకెట్టు వేసుకున్నది. నుదుట కళ్యాణతిలకం తీర్చి



దిద్దుకున్నది. కాళ్ళకు పారాణి పూసు కున్నది. ఆమె అక్కలు ఆమెకు మల్లె పువ్వుల జడ వేశారు; దిష్టి తగలకుండా బుగ్గన చుక్క పెట్టారు ఆ తర్వాత గది లోకి పంపారు. ఆమె ముఖమంతా సిగ్గుతో కందిపోయి ఉన్నది.

వాలుకుర్చీలో కూర్చుని, శూన్యంలోకి చూస్తూ దీర్ఘాలోచనల్లో ఉన్న సారథి ఆమె రాకను గమనించలేదు. హేమసుందరి ఓపిగ్గా ఓ పావుగంటసేపు తలుపుదగ్గరే నిలబడ్డది ఆ తర్వాత తన ఆగమనాన్ని సూచిస్తూ చిన్నగా దగ్గింది. సారథి వెనుదిరిగి, ఒక్క క్షణం ఆమెవైపు చూసి, అతిమెల్లిగా,

'వచ్చి కూర్చో...' అన్నాడు

అతడు తనదగ్గరకువచ్చి, తనని పొదివి పట్టుకుని తీసుకుపి వెడతాడని, ఏవేవో ఊహించుకున్నది హేమసుందరి. అతడి మాటలు విని నీరుకారిపోయింది. అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళి, అతడిదగ్గర నిలబడ్డది

'మంచంమీద కూర్చో ..'

అనేసి కళ్ళుమూసుకున్నాడు సారథి

అతను ఏమయినా మాట్లాడతాడేమో నని చాలాసేపు ఎదురుచూసింది హేమ సుందరి. చొరవచేసి మాట్లాడటానికి సిగ్గు వేస్తోంది. రెండుమూడుగంటలు గడచినాయి సారథి నిశ్చింతగా కుర్చీలో నిద్రపోయాడు.

హేమసుందరి దీర్ఘంగా నిట్టూర్చి, తల దిండు నేలమీద వేసుకుని పడుకున్నది. చాలాసేపటివరకూ ఆమె కళ్ళు మూతలు పడలేదు. భర్త ప్రవర్తనను గురించి చాలాసేపు ఆలోచిస్తూనే ఉన్నది.

తొలికోడి కూసింది. హేమసుందరికి మెలకువ వచ్చింది. కుర్చీవైపు చూసింది. సారథి ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. హేమ సుందరి లేచి, మంగళసూత్రాలు కళ్ళకద్దు కున్నది. ఆ తర్వాత భర్తపాదాలు కళ్ళకద్దు కున్నది. ఆమె చేతులు అతడి పాదాలకు తగిలినాయి. కళ్ళుతెరచి, ఆమెవైపు చూశాడు. అతడి చూపులో తిరస్కార భావ మున్నది ఆమె అతడివైపు చూసింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు ఉబికినాయి. కళ్ళు తుడుచుకుని బయటకు దారితీసింది.

రాత్రి నిద్రలేకపోవడంవల్ల హేమసుందరి కళ్ళు ఎర్రబడినాయి. ఆమెను అక్క లిద్దరూ 'రాత్రి విన్న అసలు నిద్రపోనియ్య

# జీవనవలయాలు

లేనేమిటే మరిదిగారు?' అంటూ హాస్యం చేశారు పశ్నలతో ముంచెత్తారు. హేమ సుందరి నోరు మెదపలేదు. సమాధానంగా నవ్వు తెచ్చిపెట్టుకున్నది.

ఆ తరువాత హేమసుందరి తన గదిలో ఏకాంతంగా కూర్చుని భర్త ప్రవర్తనను గురించి ఆలోచించసాగింది. ప్రప్రథమంగా తనకు పార్వతమ్మగారు అతడిని పరిచయం చేసినప్పుడు అయిష్టంగానే నిల బడ్డాడు. పెళ్ళిచూపులనాడు అతడివైపు చూసినప్పుడు అతడు మరోవైపు చూస్తు న్నాడు. 'అప్పటికే తనవైపుచూసి, ఏమీ ఎరగనట్లు మరోవైపు చూస్తున్నాడేమో?' అనుకున్నది. మంగళసూత్రం ముడివేస్తున్న ప్పుడు అతడివేళ్ళు తన మెడకు తగిలి నప్పుడూ, కావాలనే తాకాడనుకున్నది కాని, అతడిచేతులు వణుకుతున్నాయని గ్రహించ లేదు— తలంబ్రాలు భుజంమీద పోసు

## సమైక్యత

సృజనాత్మక సంక్రాంతి
సమైక్యత పెంపు విక్రాంతి

స్వారాజ్యరజతోత్సవాల
నవాగత సంవత్సరాన
సమర మయ్యే ముళ్ళగోల
సోదరాంధ్రుల హృదయాన సృజ.

భావోద్రేకపు భోగిమంటలు
బాలులందున ప్రజ్వరిల్లెను
బాధ్యతెరిగి నడిపించాలి
భావి భారత యువతరాన్ని సృజ.

హరిదాసుకు వరిబియ్యం
పరవాలేదు నడుమ తద్యం
నిరుపేదకు పట్టెడన్నం
కరువయ్యేను సోషలిజాన సృజ.

మూసిన విద్యాలయాలు
మూకుమ్మడి దహనాలు
మూర్ఖంగా పోలీసు కాల్పులు
మరచిపోని మరణాలు

ఆదోని తెనాలి ఒంగోలందు
అశువులర్పించిన ఆంధ్ర
అమరవీరులారా మీకు
అంజలుల ఘటింతుమేము.

—కొమ్మెర్ల

న్నప్పుడు కావాలనే పోస్తున్నాడనుకున్నది కాని, అతడు పరధ్యానంగా ఉన్నాడనుకో లేదు. మొదటిరాత్రి అనుభవమయ్యాక 'తనంటే అతడికి ఇష్టంలేదేమో?' అన్న అనుమానం వచ్చింది. ఉదయం అతడి పాదాలు కళ్ళకద్దుకుంటున్నప్పుడు కాళ్ళు వెనక్కు తీసుకున్నాడు, తనవైపు తిరస్కార భావంతో చూశాడు. దీనికంతకూ కారణ మేమిటి? అప్పటికే అతడి హృదయాన్ని మరో స్త్రీ ఆక్రమించుకున్నదేమోనన్న ఆలో చనవచ్చి, వెక్కివెక్కి ఏడవసాగింది హేమ సుందరి. అదే సమయానికి పార్వతమ్మ ఆమెకోసం ఇల్లంతా వెదకి ఆ గదిలోకి వచ్చింది. అలికిడి కావడంతో, హేమసుందరి తలెత్తిచూసింది. పార్వతమ్మ గదితలుపులు వేసి, ఆమె దగ్గరకువచ్చి,

'నువ్వు ఏడుస్తున్నావా? హేమా?...' అన్నది.

హేమసుందరి ఆవిడ వక్షంమీద తల ఆన్చి, వెక్కివెక్కి ఏడిచేసింది. పార్వతమ్మ ఆమె వెన్ను నిమురుతూ, చీరకొంగుతో కళ్ళు తుడుస్తూ

'నువ్వు ఏమీ చెప్పకపోయినా, పరిస్థితి నేనర్థం చేసుకోగలను ... వాడి ప్రవర్తన పెళ్ళినాటినుండి గమనిస్తూనే ఉన్నాను — నువ్వు అనవసరంగా దిగులుపడతావని, నిన్ను వెతుక్కుంటూ వచ్చాను ... పిచ్చిపిల్లా . ఎలా తయ్యారయ్యావో నోసారి అద్దంలో చూసుకో ...వెళ్ళి మొహం రుద్దుకునిరా... నీతో మాట్లాడాలి...' అన్నది.

పార్వతమ్మ కుర్చీలో కూర్చున్నది. హేమ సుందరి వెళ్ళి ముఖంరుద్దుకుని, నుదుట కుంకుమ దిద్దుకుని వచ్చి ఆవిడ ప్రక్కనే కూర్చున్నది.

పార్వతమ్మ అరమరికలు లేకుండా, సారథి నీరజను ప్రేమించడమూ, పెళ్ళికి తను అంగీకరించక పోవడమూ క్లుప్తంగా చెప్పి,

'నా కొడుకు చెడ్డవాడుకాదు హేమా... వాడికి వయసయితే వచ్చింది... పెద్ద చదు వయితే చదివాడు...ఆఫీసరు ఉద్యోగమయితే చేస్తున్నాడు ... కాని వాడిది పసిపిల్లల స్వభావం ... తను కోరుకున్నది కాదంటేని గ్రహించుకోలేడు...వాడిని మరపించాలి... నువ్వు వాడిని ఓ దారిని పెట్టగలవనే నమ్మకం నాకుఉంది ... నువ్వంటే నాకు చాలా యిష్టం హేమా...అలాంటిది నీకు

చెప్పింది

'పెళ్లయి అట్టే రోజులు కాలేదమ్మా... కొద్దిరోజులు ఉంచుకుని పంపుదామనుకుంటున్నాం...' అన్నారు రామారావుగారు.

'ఈసారికి మీరు అభ్యంతరం పెట్టకండి. నేనేంచేసినా హేమ సుఖం దృష్టిలో పెట్టుకునే చేస్తున్నా...కొద్దికాలం పోయాక నేనే పంపిస్తాను...'

'వదినగారు పెద్దవారు...ఆవిడ మాటను కాదనడమెందుకు? ... మనం పంపించమన్నప్పుడు ఆవిడ పంపించనంటారా? ... అయినా హేమ పై ఇంటికి వెళ్ళడంలేదు. వదినగారు దాన్ని కన్నకూతురిలా కడుపులో పెట్టుకుని చూసుకుంటారు...' అన్నది రాజ్యలక్ష్మి.

'సరేనమ్మా... పెద్దవారు మీరు.. మీ ఇష్టప్రకారమే కానివ్వండి...' అన్నారు రామారావుగారు.

* * *

సారధి ఆఫీసులో చేరవలసిన రోజుకు ముందురోజే పార్వతమ్మా, సర్వోత్తమ్మా, సారధీ, హేమసుందరీ మద్రాసు చేరుకున్నారు. సారధి ఉంటున్న ఇల్లు చూసి పార్వతమ్మ ఆశ్చర్యపోయింది. అది కొడుకు చెప్పినట్లు చిన్న ఇల్లుకాదు. కొడుకు చిన్న ఇల్లని ఎందుకుచెప్పాడో అర్థం చేసుకున్నదావిడ.


ఆరోజు హేమసుందరికీ, పార్వతమ్మకూ ఇల్లు సర్దడంతోనే సరిపోయింది. సారధి తనకేమీ పట్టనట్లు శూన్యంలోకి చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూ హాల్లో కూర్చున్నాడు. మరునాడు తను ఆఫీసుకు వెళ్ళాలని గుర్తుకు వచ్చినప్పుడల్లా, నీరజకు తను చేసిన అన్యాయం కళ్ళముందు మెదులుతున్నది. ఆమెకు తన ముఖం ఎలా చూపాలో అర్థం కావడంలేదు.

ఆరాత్రి సారధికి కంటిమీద కునుకు లేదు.

తెల్లవారింది.

సారధి వేళకు ఆఫీసుకు చేరుకున్నాడు. తన గదిలోకి వెడుతూ, అప్రయత్నంగా నీరజ 'సీటు'వైపు చూశాడు. ఆ సీట్లో నీరజలేదు. మరో అమ్మాయి కూర్చుని ఉన్నది. సారధి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు. నీరజ తన ముఖం చూడటం ఇష్టపడక సీటుమార్చుకుని ఉండవచ్చు; లేదా తను ఆఫీసులో చేరుతున్నట్లు తెలిసి సెలవు పెట్టి ఉండవచ్చు. సారధి తన సీట్లో కూర్చుని

# రూపం : ఊపిరి



— డా॥ సి. నారాయణరెడ్డి

చీకటి చిక్కగా వుంటుంది
వెలుతురు పల్చగా వుంటుంది.
అయినా వెలుతురంటేనే నాకు
అంతులేని అభిలాష

రూపం చిక్కగా వుంటుంది
ఊపిరి పల్చగా వుంటుంది
అయినా ఊపిరంటేనే నాకు
అవధిలేని ఆశ.

రాళ్లుంటాయి రత్నాలుంటాయి
ముళ్లుంటాయి సెలయేళ్లుంటాయి
పాపాలుంటాయి పరమపుణ్యాలుంటాయి
కోపాలుంటాయి చంద్రదీపాలుంటాయి
అన్నిటినడుమ అల్లుకునే
అఖండచేతన ఒకటుంది.
ప్రపంచాన్ని పలికించే
ప్రాణస్పందన ఒకటుంది

మనసు నగరిని ప్రళయం
సంక్రమించినప్పుడు,
యాత్రాపథికి రెండుకాళ్లూ
తెగిపోయినప్పుడు;
పట్టుతో ఎదగలిగిన బాహుదండాలు
పట్టిపోయినప్పుడు;
కుంగిన మనసును పొంగించే—
కోటి ఆశల కుసుమం విడిపించే—

అంధతమస్సులో కోల్పడ్డ మనిషిని
అపూర్వ వ్యక్తిగా శిల్పించే—
ఆ ఊపిరి కావాలని నా ఆరాటం.
అందుకే అసురశక్తితో ఈ పోరాటం.

ఊపిరి పునాదిలాంటిది
ఉక్తి ముఖద్వారం లాంటిది.
చూపు గవాక్షం లాంటిది
రూపం గోపురం లాంటిది.

నిత్యం నేను కోరుకునేది
మృత్యువును నిర్జించే చైతన్యకాంతిని.
ఊపిరితో పురోగమించే
రూప సంక్రాంతిని.

ఆఫీసు కాగితాలు చూడటంలో నిమగ్నుడయ్యాడు. కొద్దిసేపు గడిచాక 'హెడ్ క్లార్క్' శ్రీనివాసన్ అతడి దగ్గరకు వచ్చి పెళ్ళి విశేషాలు అడిగాడు. సారధి ఏదో చెప్పాడు. ఏం చెప్పాడో అతడికే తెలియదు. శ్రీనివాసన్ బయటకు వెడుతూ, 'అన్నట్లు తంగమణిని పరిచయం చేస్తానుండండి...' అని నీరజ సీట్లో కూర్చుని ఉన్న అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చాడు.

'ఈవిడ తంగమణి. నీరజగారి – చేసిందా..., 'వేకెన్సీలో తీసుకున్నారు...'

సారధి 'ఉలిక్కి' పడ్డాడు.

తంగమణి అతనికి నమస్కరించింది. మాట వరుసకు నాలుగు ముక్కలు మాట్లాడి ఆమెను పంపేశాడు సారధి. తంగమణి వెళ్ళాక శ్రీనివాసన్ అన్నాడు


'నీరజగారిలాగే తంగమణి కూడా 'సిన్సియర్ వర్కర్...'

సారధి మెల్లిగా అన్నాడు:

'నీరజకు ఏమయింది? రిజైన్

శ్రీనివాసన్ కొద్దిక్షణాలు మాట్లా

# దూడపాలకు ఎంగిలి లేదు



బులుసు వేంకటరమణయ్య — ధర్మపథం

ఆవును పాలు పితికేటప్పుడు మొదట దూడను తల్లి దగ్గరికి విడుస్తారు. ఆవు చేపి, పాలను విడుస్తున్నప్పుడు దూడ తాగడం ప్రారంభిస్తుంది. ఆ సంగతి కని పెట్టిన వెంటనే దూడను కట్టివేసి, చెంబులోకి పాలు పితుకుతారు. దూడ విడిచిన పొదుగునుంచే పాలు పితికినా అవి ఏంతమాత్రం ఉచ్ఛిష్టం కావు. అవి దేవుని నైవేద్యానికి పనికివస్తాయి. ఆ పాలు ఎంగిలివి అయితే ఎంగిలివి కాని పాలు లభించనే లభించవు.

ఈ విషయాన్నే బ్రహ్మదేవుడు ఒకప్పుడు పరమేశ్వరుడికి వివరించి చెప్పవలసి వచ్చింది.

ఒకప్పుడు పరమేశ్వరుడు హిమాలయం పై తపస్సు చేసుకుంటున్నాడు. ఆ చుట్టు ప్రక్కల వున్న పచ్చిక బయళ్లలో ఆవులు మేస్తూ వుంటాయి. దూడలు పాలు తాగుతూ చంగుచంగున గంతులు వేస్తూ వుంటాయి ఒకప్పుడు ఒక దూడ పాలు తాగిరన వెంటనే గంతులు వేస్తూ శివుని దగ్గరకు వచ్చింది. దాని నోటిలోని పాల నురుగునుండి ఒక బిందువు శివునిమీద పడింది.

తనమీద ఉచ్ఛిష్టం పడినందువల్ల శివునికి ఎంతో కోపం కలిగింది. ఆయన మూడవకన్ను తెరిచి పశువుల వైపు చూచాడు. ఆ చూపులో అగ్నితో సమాన మైన తీక్ష్ణమైన తేజస్సు గోవులమీద వ్యాపించింది. ఆ గోవులు ఆ తేజస్సు యొక్క తాపానికి నల్లగా అయిపోయాయి. అవి శివుణ్ణి చూచి భయంతో నలుదిక్కులా చెదరిపోయాయి.

అప్పుడు బ్రహ్మదేవుడు శివునివద్దకు వచ్చి, దూడనోటి పాలనురుగుకు ఎంగిలి లేదని వివరంగా చెప్పి ఆయనను శాంత పరిచాడు. శివుడు ప్రశాంతమైన దృష్టిని ఆ గోవులపై ప్రసరింపజేయగా అవి మామూలుగా ఉండిన వర్ణాన్ని పొందాయి.

బ్రహ్మదేవుడు సంతోషించి, శివునకు ఒక వృషభాన్ని బహూకరించాడు. అది శివునిని వాహనమయి నందీశ్వరుడుగా పేరు పడింది. ●

## జీవనవలయాలు

లేదు, చివరకు గాఢంగా నిట్టూర్చి, 'మీరు టీపు' మీద వెళ్లిన వారం పదిరోజులకు అనుకుంటా... నోరోజు పిచ్చిదానిలా నవ్వుతూ, అరుస్తూ, ఏడుస్తూ వచ్చింది... ఆ తర్వాత తండ్రీ వచ్చి ఆమెను తీసుకుని వెళ్ళాడు...ఆమెకు పిచ్చి వత్తింది... ప్రస్తుతం ఆమె 'పిచ్చాసుపత్రి'లో ఉంది... పాపం చాలా మంచి అమ్మాయి ...' అన్నాడు.

సారధి ఏమీ మాట్లాడలేక పోయాడు. శ్రీనివాసన్ వెళ్లిపోయాడు.

సారధి చాలాసేపు అచేతనంగా కూర్చుండి పోయాడు. అతడి మనసు వికల మయింది. అతడి దృష్టి ఆఫీసు కాగితాల మీద పోలేదు. నీరజ కళ్ళముందు మెదల సాగింది...ఆమెకు పిచ్చి ఎత్తిందంటే నమ్మ శక్యం కావడంలేదు. అతడికి తల్లి మాటలు గుర్తుకు వచ్చినాయి. నీరజను తను పెళ్లిచేసుకుని ఉంటే? చిన్న మామయ్య జీవితంలాగే తన జీవితమూ తయారయ్యేనేమో?' అమ్మ నిజమే చెప్పింది' అనిపించిందతనికి.

అతడి కళ్లముందు నీరజ స్థానంలో హేమసుందరి మెదలసాగింది. హేమసుందరి అందంగా ఉంటుంది. ఆమె కళ్ళల్లోనూ ముఖంలోనూ అమాయకత్వమే వున్నది. రూపానికి తగిన మనసు ఆమెది. పెళ్ళి నాటి నుండీ ఆమె ఎడల తన ప్రవర్తనను మననం చేసుకుని, 'అనవసరంగా నో అమాయకురాలిని హించాను' అనుకుని పశ్చాత్తాప పడ్డాడు సారధి.

ఆ సాయంత్రం సారధి ఇంటికి వెడుతూ, భార్యకు నో ఖరీదయిన చీర కొన్నాడు; మల్లెచెండు తీసుకున్నాడు.

అతడు వెళ్లేసరికి హేమసుందరి హాల్లో కూర్చుని వారపత్రిక చదువుతున్నది. అతడిని చూసీ చూడటంతో కాఫీ తేవడానికి లోపలకు వెళ్ళబోయింది. ఆమె రెండడుగులు వేసిందో లేదో.

'హేమా...' అన్నాడు సారధి,

హేమసుందరికి అడుగులు ముందుకు పడలేదు. భర్త తనను ఇంతవరకూ ఏన్నడూ పేరుపెట్టి పిలవలేదు. అది 'కలో నిజమో' అర్థంగాక అతడివైపు చూసింది. సారధి ఆమెవైపు నడిచాడు. ఆమె రెండడుగులువేసి అతడిదగ్గరకు వెళ్ళింది. అతడు ఆమెకు సొదివిపట్టుకుని, తల పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూస్తూ,

'నీకేం తెచ్చానో చూశావా హేమా?...' అన్నాడు.

హేమసుందరి కళ్ళల్లో ఆనందాశ్రులు చిందులాడినాయి. అతని వక్షంపై తల వాల్చి, కళ్ళుమూసుకుని, తన్మయత్వంలో మునిగిపోతూ, మృదుమధురమయిన స్వరంతో అన్నది :

'ఏమీ అక్కర్లేదు ... ఇంకేమీ అక్కర్లేదు ... మీ హృదయంలో కాస్త జాగా ఇవ్వండి...అంతే చాలు...'

ఆరోజు మొదలు సారధికి భార్యపై ప్రేమానురాగాలు దినదినాభివృద్ధి కాసాగినాయి. అతడి హృదయఫలకంమీద నీరజ చిత్రం రానురాను లేతవర్ణందాల్చి అదృశ్యమయింది, హేమసుందరి చిత్రం ఆ స్థానాన్ని ఆక్రమించుకుని రోజురోజుకూ వన్నెతెచ్చుకుని స్థిరపడ్డది.

నీరజకు పిచ్చియెత్తడానికి కారణం ఏమిటయి ఉంటుందో సారధి ఎన్నడూ ఆలోచించలేదు !

(అయిపోయింది) ●